# సత్యాన్వేషులు

రంగడు అదివరకెన్నడూ బస్తీ మొహం ఎరుగడు.

"ఏం రోడ్లు ఏం జనం! ఏం మోటారుకార్లు! ఏం జట్కాబళ్ళు! ఏం మేడలు! నా రంగా ఏం దుకాణాలు!" అనుకున్నాడు వాడు.

రోడ్డుపక్క నిలబడి చూస్తుంటే రంగడికి, ఎవరో తన ముందు అంతులేని, రంగు రంగుల మిఠాయిలు పెద్ద పళ్లెంలో పెట్టి "ఏం కావాలో కోరుకో!" అని అడిగినట్టుంది. వాడు జట్కాబళ్ళు తోలేవాళ్ళ కేసీ, కిల్లీకొట్లలో కూచున్నవాళ్ళ కేసీ వింతగా చూశాడు. అటువంటి పనులలో ఏది తనను చెయ్యనిచ్చినా వాడి కభ్యంతరం లేదు. కాని చెయ్యనివ్వరు ఆ సంగతి వాడికి తెలుసు.

రంగడు రోడ్డువెంట నడుస్తూ ప్రతి యింటి కేసి పరీక్షగా చూడసాగాడు. మంచి అందమైన మేడగా చూసి అందులో పనికి కుదరాలని వాడు నిర్ణయించుకున్నాడు. కొన్ని కొన్ని ఇళ్ళు చూస్తే, "ఇటువంటి ఇంట్లో ఉన్నచాలు!" అనిపించింది వాడికి. ఒకటి రెండు ఇళ్ళలో అడిగి చూశాడు వాళ్ళు రంగణ్ణి పెట్టుకోమన్నారు వాళ్ళతో వాడాట్టే తర్కించలేదు. నిశ్చింతగా వచ్చేశాడు. ఈపాదున శానా కొలువులున్నై!"

రోడ్డుపక్కనే ఇళ్ళ నీడ వెంబడి నడుస్తున్న రంగడు అకస్మాత్తుగా ఆగాడు. వాడికెదురుగా చాలా అందమైన ఇల్లున్నది. బయటిగేటు చాలా పెద్దది. దానికి ఇనుపచువ్వల తలుపులున్నాయి. అవి తెరిస్తే రెండెడ్లబండి అవలీలగా లోపలికి పోవచ్చు. సామిరంగా, లోపలికి ఏకంగా రోడ్డేఉంది! రోడ్డుపక్కన భలే అందమైన మొక్కలున్నై. అవి ఏం కాయలు కాసేదీ రంగడికి తెలీలేదు గాని! లోపల మేడ, పైనా కిందా కూడా పెద్ద స్తంభాలు. అంత పెద్ద స్తంభాలు రంగడెన్నడూ చూడలేదు. గట్టిగా, నున్నగా, ఎండ పడి నిగనిగలాడుతున్నై.

ఈ గొప్పఇంటిని ఇంకా దగ్గరగా చూడగలందులకై రంగడు రోడ్డుదాటి ఇనుపకడ్డీల వాకిలి దగ్గరకువచ్చి నిలబడ్డాడు. ఒక స్తంభం పక్కగా తీగ ఒకటి ఏకంగా పై అంతస్తుకు పాకిపోతున్నది. దానినిండా దట్టంగా ఆకులున్నై. పూలేమీ కనపళ్ళేదు.

"ఆ ఆకులన్నీ తమలపాకులైతే-సావిరంగా-"

ఆ తీగకేసి ఎంతసేపు చూసినా రంగడికి తనివి తీరలేదు పై అంతస్తుకు వెళ్ళి ఆతీగ పట్టుకుని సర్రున కిందికి జారాలని రంగడికి ఎంతో అనిపించింది.

"ఏయ్, ఎవరు నువ్వు?"

ఈ ప్రశ్నకే అయితే రంగడు వెనక్కు తిరిగి చూసి ఉండకపోను ఈప్రశ్న వెంటనే "కంయ్, కయ్" మని ఏదో కుక్క అరిచిన చప్పుడు విని రంగడు వెనక్కు తిరిగాడు.

ముందు వాడికి నేలమీద ఒక గోధుమరంగు కుక్కపిల్ల కనిపించింది. దానిమెడలో ఒకపట్టీఉంది. ఆ పట్టీకి తగిలించిన గొలుసు వెంబడే రంగడి చూపులు కుక్క యజమానురాలి చేతిమీదికీ, క్రమంగా ముఖంమీదికీ లేచాయి.

ఈ యజమానురాలికి పదహారేళ్ళు ఉండవచ్చు. ఆమె రెండు జడలు వేసుకుంది. జరీఅంచుగల ఎర్రపట్టు పరికిణీ కట్టుకుని, పలచని తెల్లవోణీ వేసుకున్నది. ఆమె జాకెట్టు కూడా తెల్లనిదేగాని ఎండలో నిగనిగ మెరుస్తున్నది. ఆమె శరీరచ్ఛాయ రంగడి కళ్ళకి పాలరంగులో ఉన్నట్టు తోచింది. ఆమె ముఖానఉన్న ముడత రంగణ్ణి భయపెట్టలేదు. వాడామెకేసిచూసి అర్థం లేకుండా నవ్వాడు. ఆనవ్వు ఆమెను మరింత కోపం తెప్పించినట్లు కనిపించింది.

"ఏమిటి ఇకిలిస్తావ్? లోపలికి చూస్తున్నావెందుకు? ఏంకావాల నీకు?"

మళ్ళీ కుక్క మొరిగింది. యజమానురాలి నోట ఏ మాట వచ్చినా బలపరచటం తన విధి అని కుక్కపిల్ల భావించినట్టున్నది.

"నౌకర్!" అన్నాడు రంగడు కుక్కపిల్లకేసి ఆపేక్షగా చూస్తూ. ఈప్రపంచంలో తనకు శత్రువులు వుండవలసిన అగత్యం వాడికి కనిపించలేదు.

"నౌకరీయా? ఏం చేస్తావు?"

"ఏం చెయ్యమంటే అది చేస్తాను"

"మీ ఇల్లెక్కడ?"

"మా దీవూరు కాదు. నా కెవరూ లేరు."

"నీ పేరు ?"

"రంగడు"

ఆ పిల్ల రంగడికేసి చూస్తూ కొంచెంసేపు ఏదో ఆలోచించింది. రంగడు అకస్మాత్తుగా తన సమస్య అయినట్టూ, దానిని పరిష్కరించే బాధ్యత తనపై పడట్లూ ఆపిల్ల భావించింది. అంత చిన్నవాడు–రంగడికి పన్నెండేళ్ళుకూడా ఉన్నట్లు కనపడలేదు. నా అన్నవారు లేకుండా పొట్ట చేత పట్టుకురావటం సరోజినికి చాల జాలి కలిగించింది.

ఆమె చప్పున తన ఆలోచన ముగించి, "నాన్నగారితో మాట్లాడదాం లోపలికి రా." అన్నది కదులుతూ.

కుక్కపిల్ల రంగడి స్థాయిలో మార్పు కనిపెట్టినదానల్లే ముందుకువచ్చి ముక్కు లెగరేస్తూ వాడి మడిమలు వాసన చూసింది.

"అమ్మగారూ! ఆ గొలుసు నన్నొకసారి పట్టుకోనివ్వండి."

సరోజినికి రంగడిమీద కలిగిన సదభిప్రాయం ఒక్క దెబ్బన ద్విగుణీకృత మయినట్టయింది. తన చేతిలో గొలుసు వాడి చేతికిచ్చి లోపలికి పరిగెత్తింది. ఎండలో మెరిసే ఆమె పరికిణీ అంచుకేసి చూస్తూ రంగడు కుక్కను వెంటబెట్టుకుని లోపలికి వెళ్ళాడు. ఇదంతా వాడికేదో కలలాగా ఉంది.

# 2

సరోజిని తండ్రి గోపాలరావు ఆవూరి ప్రముఖ వ్యక్తుల్లో ఒకరు. ఆయన వృత్తిచేత ప్లీడరు, కాని ఆయన అసలు వ్యాపకం సత్యాన్వేషణ. గోపాలంగారు పుట్టినది శ్రోత్రియ కుటుంబంలో. ఆయన చాలా చిన్న వయసులోనే గీతపారాయణ చేశాడు. వేదోక్తమైన కర్మలంటే చాలా అభిమానం ఉండేది. తాను వేదం చదువుకోనందు కాయన చాలా విచారించాడు. ఎవరైనా మంత్రపుష్పం చదువుతున్నప్పటికీ ఆయనకు పారవశ్యం కలిగేది.

గోపాలంగారు స్కూలు చదువు పూర్తిచేసి కాలేజీ చదువుకు రాజమండ్రి వెళ్ళినప్పటినుంచీ ఆయనలో పెద్ద మార్పు కలిగింది. ఒక్కసారిగా ఆయనకు మన మతాచారాలనుగురించి కనువిప్పు కలిగింది. వీరేశలింగంగారి ప్రభావమే దీనికి కారణం. వీరేశలింగంగారి రచనల పఠనమూ, వీరేశలింగంగారి ప్రభావానికి గురిఅయిన వారితో సాంగత్యమూ గోపాలంగారిని పూర్తిగా మార్చివేశాయి. తన బాల్యమంతా పుచ్చిపోయి బూజుపట్టిన జ్ఞానాన్ని ఆరాధించటంలో వ్యర్థమయిందని ఆయన భావించాడు.

ఈ పశ్చాత్తాపం కారణంగా ఆయన మరింత ఉద్రేకంతో "సంస్కారం"లో పడ్డాడు. ఆయన కాలేజీ జీవితం వితంతు వివాహాలను ప్రోత్సహించటంలో సరిపోయింది. ఈ వ్యాపకాలమూలంగా గోపాలంగారు పరీక్షలు తప్పకపోయినా తెచ్చుకోదగినంత మంచి మార్కులు తెచ్చుకోలేకపోయాడు.

బియ్యే పూర్తికాగానే గోపాలంగారు "లా" చదవటానికి మద్రాసు వచ్చాడు. మద్రాసు మహానగరంలో పడి ఇతర జాతులవారితో సంపర్కం కలిగి, ఉన్నతసంస్కారమూ హెచ్చు సంపాదనాగలవారి పరిచయం ఏర్పడ్డాక జీవితంలో వితంతు వివాహాలకన్నా చాలా ముఖ్యమైన విషయాలింకా ఉన్నట్టు ఆయనకు తోచింది

మద్రాసు వాతావరణంలో ఆయన నేర్చుకున్న కొత్త సాంఘిక సత్యాలేమీ లేవుగాని, ఆయనకు వ్యక్తి స్వేచ్ఛనుగురించీ, నీతిని గురించీ కొత్త దృక్పథం అలవడింది. ప్రజలు జీవితాన్ని ఏమాత్రమూ ఆనందించలేక పోవటానికి ప్రధాన కారణాలు వారి మనస్సులు శృంఖలా బద్ధమై ఉండటమే. సమర్తాడిన పిల్లలకు పెళ్ళిళ్ళుచేస్తే కొంప ఏం మునిగి పోతుంది? రంకుతనాలను గురించి రాద్ధాంతాలు చేస్తారెందుకు? మగవాళ్ళకు లేని పవిత్రత ఆడదాని కెందుకూ? పురుషులకి నిజంగా పాతివ్రత్యంలో విశ్వాసం ఉంటే ఇతరుల భార్యలతోనూ, సానులతోనూ ఎందుకు పోతారు? చూడగాచూడగా గోపాలంగారికి "నీతి" అన్నది ఆడదాన్ని చిత్రహింస చేయడానికి మగవాడు సృష్టించిన నరకంలాగ కనిపించింది?

"అవినీతివల్ల సుఖరోగాలు వ్యాపిస్తాయి! కన్యలకూ, వితంతువులకూ గర్భాలు కలుగుతాయి." అని గోపాలంగారి మిత్రులు కొందరు వాదించారు.

"అదంతా బొల్లి కబుర్లు! మొగుడు పెళ్లానికి తన రోగాలు తగిలిస్తే ఎవరూ దాన్ని గురించి చెప్పరేం? ఏ భోగం మనిషో మగవాడికి రోగాలు తగిలిస్తే అవినీతివల్ల కలి

గిందంటారు? నీతిగా రోగాలు వ్యాప్తికానట్టు! ఇక కడుపుల మాటకొస్తే మొగుడున్న ఆడది పొరుగింటి వాడికి పిల్లల్ని కనటం ధర్మమేగాని, శరీర సుఖంకోసం అలమటించే వితంతువుకు గర్భం రాకూడదేం?"

వాదిస్తున్న కొద్దీ గోపాలంగారికి తన బలమూ దానితోబాటు ఈసమస్యయొక్క ప్రాముఖ్యం పెరుగుతున్నట్టు తోచింది. ఈ రకం వాదనల మూలంగా గోపాలంగారికి శత్రు కూటాలు ఏర్పడ్డారు. ఒక "పెద్దమనిషి" తనను గురించి దుష్ప్రచారం చేస్తున్నాడనీ, తనకు పెళ్ళయితే భార్యను అందరి దగ్గరికీ పంపుతాడు కాబోలని అంటున్నాడనీ తెలిసి గోపాలంగారు చలించలేదు గాని, క్షుద్రబుద్ధి గల వాళ్లు తనమీద ఇటువంటి ప్రచారం ప్రారంభించారంటే తాను చెప్పేదానిలో బలమైన సత్యం ఏదో వుండాలని ఆయనకు విశ్వాసం కలిగింది.

లా చదువుతున్నప్పుడే గోపాలంగారికి తన కాబోయే భార్యతో పరిచయమయింది. ఆమె అప్పుడు క్వీన్ మేరీస్‌లో ఇంటర్ జూనియర్ చదువుతోంది. ఆమెకూడా గోపాలంగారిలాగే ధనికుల బిడ్డ. కాని ఇద్దరికీ తేడా ఏమిటంటే ఆమె పూర్వీకుల ఉద్యోగాలుచేసి, పెద్దపదవులలో వుండి డబ్బు గడించినవారు; గోపాలంగారి పూర్వీకులలాగే అగ్రహారీకులు కారు. సంప్రదాయాన్నిబట్టి తన సంస్కృతికన్న తన భార్యది ఉన్నతమైనదని గోపాలం గ్రహించాడు. గోపాలంగారు సత్యాన్వేషణ శక్తితో తెలుసుకున్న విషయాలు ఆమెకు సంప్రదాయ సిద్ధంగా తెలిసినట్టు కనబడ్డాయి. ఒకసారి గోపాలం

గారు పెళ్ళికిముందే, వీటిని గురించి తనకుగల ఉద్దేశాలు తన కాబోయే భార్యకు చెప్పబోతే ఆమె వేళాకోళంగా నవ్వి, "ఈ 1923 లో కూడా ఇటువంటి విషయాలు ఎవరైనా సీరియస్‌గా చర్చిస్తారా చెప్పండి!" అన్నది. ఆ తరువాత ఆయన ఎప్పుడూ వాటి ప్రసక్తి తీసుకురాలేదు

ఆ మరుసటి ఏడు వివాహ మయినాక గోపాలంగారు తన భార్యను గురించి అతి విచిత్రమైన విషయం తెలుసుకున్నాడు! ఆమెకు సత్యాన్వేషణాసక్తి కొంచమైనా లేదు. ఒక స్థాయికి తగ్గకుండా జీవితం గడుపుతూ, తన కన్న తక్కువగా జీవించేవారిని మనుషుల కింద జమకట్టకపోవటమూ, తన కన్న బాగా జీవించే వారిని గురించి అసూయ పడటమూ తప్ప ఆమెకు మరొక జీవితాశయం వున్నట్లు కనబడలేదు. ఆమెలో గల ఈ లక్షణాన్ని సంస్కరించటానికి గోపాలంగారు ఎట్టి యత్నమూ చెయ్యలేదు. అది చాల మేలయింది. లేని పక్షంలో వారి మధ్య ఉన్న గోడ విరిగి ఎవరో ఒకరిమీదపడి విచ్ఛిత్తి కలిగించి ఉండేదే. ఆ గోడ అక్కడ లేనట్టు నటించడం నేర్చుకుని గోపాలంగారు చాలా వివేకం ప్రదర్శించారు. గోపాలంగారు ఆత్మవంచన లేకుండా భార్యకు చాల స్వాతంత్ర్యమిచ్చాడు. ఆమె దాన్ని ఎట్లా ఉపయోగిస్తున్న దన్న విషయంకూడా ఆయన పట్టించుకోలేదు. కిట్టనివాళ్ళు ఆమెమీద ప్రవాదులు కొన్ని సృష్టించారు. కాని గోపాలంగారి భార్య వస్తుతహ భావనాశక్తి కలదికాదు. తన భర్తనుగాని మరొకరినిగాని "ప్రేమించే"టంత ఆత్మత్యాగమూ, ఆధ్యాత్మిక

దార్ఢ్యమూ ఆమెలో వున్నట్టు సాక్ష్యం ఆవగింజంతకూడా లేదు.

గోపాలంగారికి సరోజినీ, ఉదయకుమార్ - ఇద్దరే సంతానం. సరోజిని చాలవరకు తండ్రివంటిదే. ఉదయకుమార్ పూర్తిగా తల్లిపోలిక. వాణ్నిచూసి ఒక్కొక్కసారి, నా కేదైనా అర్థమవుతుందిగాని వీడుమాత్రం అర్థంకాడు" అనుకునేవాడు.

అప్రెంటీస్ పూర్తిచేసి గోపాలంగారు ప్రాక్టీసుప్రారంభించాక ఆయనకు జీవితం గురించి ఉండిన అభిప్రాయాలు కొన్ని మారాయి. విద్యార్థిగా వుంటూ సహించలేకపోయిన ఆధార వ్యవహారాలు కొన్నింటిని ఆయన సహించటం నేర్చుకున్నాడు. సంఘంలోని కుళ్లు ప్రచారంతో తొలిగేది కాదన్న వాస్తవం ఆయనకు తెలిసి వచ్చింది. అదీగాక, ఈ కుళ్లు కేవలం మనస్సులనే ఆశ్రయించి వుందా అన్న అనుమానంకూడా ఆయనకు కలిగింది. ఇప్పటికే ఆయనలో సత్యాన్వేషణాశక్తి వున్నప్పటికీ అది మునుపటిలాగా ప్రజ్వలించటం లేదు. నివురు కప్పిన నిప్పులాగా వుంది. అదీగాక అప్పుడప్పుడూ అరాచకంగా ప్రవర్తిస్తోంది.

కొంతకాలక్రితం ఆయన కొక జ్యోతిష్కుడు కనిపించాడు. ఆ జ్యోతిష్కుడు తటస్థపడినదాకా గోపాలంగారు జోస్యాన్ని తీవ్రంగా ఖండించేవాడు. కాని ఒక్కసారిగా గోపాలంగారి అభిప్రాయాలు వేళ్లతో సహా ఊడి వచ్చాయి. ఈ జ్యోతిష్కుడు ఆయన చక్రంవేసి బ్రహ్మరుద్రాదులకు కూడా తెలియదనుకున్న అంశాలు రెండు మూడు చెప్పాడు.

ఈ విషయం మరొక లాయరు మిత్రుడితో అంటే, ఆయన నాడీ గ్రంథాలను గురించీ, వాటిలో చిత్ర విచిత్ర విషయాలను గురించీ గంటల తరబడి చెప్పాడు.

ఇదే విధంగా ఇంకో సందర్భంలో చచ్చిన వాళ్ళు పూర్తిగా చావరనీ, వారు వేరే లోకంలో వుండి సోదిలోకి వస్తారని గోపాలంగారికి నిదర్శనం దొరికింది. ఆయనతో అనేక మంది స్పిరిచువాలిజం గురించి అంతులేని కథలు చెప్పారు. ఇవన్నీ వింటున్నకొద్దీ గోపాలంగారి భావాలు పునాదితో సహా కదులుతున్నట్టయింది.

"కొన్ని విశ్వాసాలు మూఢ విశ్వాసాలనుకోవటమే మూఢ విశ్వాసమైతే!" అనుకున్నాడు గోపాలంగారు. ఈ ఆలోచన ఆయనకు బాధ కలిగించింది. సత్యాన్వేషికి మనః క్లేశం కలుగుతుందనే విషయం ఆయన అనుభవంలోదే. కాని ఈ విధంగా సత్యాన్వేషి గానుగెద్దులాగా కొన్ని వేళ్ళ తరవాత ప్రారంభించినచోటికే వస్తే అభివృద్ధి ఎక్కడ ?" గోపాలంగారి బుర్ర కొంతకాలంగా అయోమయంలో పడి వున్నది. ఆచరణలేని సత్యాన్వేషణ అయోమయంలో పడక తప్పదు. ఈ సంగతి గోపాలంగారికి స్పష్టంగా తెలీదు.

## 3

కోర్టుకు వేళవుతుంది. గోపాలంగారు అప్పుడే ఆఫీసు గదిలోనుంచి బయటకివచ్చి, వరండా మెట్లెక్కి గబగబా వస్తున్న కుమార్తెను చూసి ఆగారు.

"నాన్నా, నాన్నా! పని చేస్తానని కుర్రాడొక డొచ్చాడు. కుక్కను చూడడానికి పెట్టుకుందామా?" అన్నది సరోజిని.

"కావాలంటే మీ అమ్మతో చెప్పి పెట్టుకోమ్మా! ఏడీ వాడు?" అన్నాడు గోపాలంగారు.

ఇంతలోనే కుక్కతో సహా రంగడు వచ్చాడు.

"ఏంరా, అబ్బాయ్? పనిచేస్తావా? ఏంపని చేస్తావ్?

"ఏదైనా చేస్తానండి. గొడ్లకి మేతేస్తాను, కసు వూడుస్తాను."

గోపాలంగారు నవ్వారు.

"మా ఇంట్లో మేంతప్ప వేరేగొడ్లు లేవు. చూడు! నీకు కుక్కలంటే ఇష్టమేనా?"

"ఇష్టమేనండి." అన్నాడు రంగడు విశాలంగా నవ్వుతూ.

"జీతం ఏంతీసుకుంటావు. అన్నంపెట్టి ఇంట్లో ఉంచు కొంటే ఉంటావా? మీ ఇల్లెక్కడ?

రంగడికి ఊరూ, అయినవాళ్ళూ లేరని సరోజిని చెప్పింది.

"మీఇష్టం ఏమిచ్చినా సరే!" అన్నాడు రంగడు.

ఆరోజే వాడు గోపాలంగారింట్లో నౌకరీకి కుదిరాడు. ఇటువంటి నౌకరీవాడు కలలోకూడా ఊహించలేదు, వాడి కేమీ పనిలేదు. వాడు వంట ఇంట్లోకి కూడా పోవచ్చు.

కూరలు తరగొచ్చు, వంటలక్క రామమ్మ వాణ్ని నెయ్యి కరగబెట్ట మన్నది. అయ్యగారికి వడ్డించమన్నది. కాని తీరా వడ్డించటానికి వెళ్ళేసరికి సరోజిని వాణ్ణి కోప్పడి, "రంగడూ! నువ్వు స్నానాలగదిలోకి పోయి వెంటనే స్నానం చేసిరా!" అని శాసించింది. వాడివెంట స్నానాలగదికిపోయి వేడినీళ్లూ, సబ్బూ చూపించింది.

రంగడు వాడిజన్మలో సబ్బెరగడు. అదిపెట్టి తలదగ్గిర నుంచీ కడుక్కుంటే వాడికి మురికి వదిలినట్టుండటానికి బదులు వొంటికంతా సబ్బు పట్టుకున్నట్టున్నది. అయితే సబ్బు వాసన మటుకు వాడికి బాగానే ఉంది. స్నానం చేసినాక సరోజిని రంగడికి తన తమ్ముడి పాతలాగూ, చొక్కా ఇచ్చింది. అవి వేసుకోవటానికి రంగడు చాలా సిగ్గుపడ్డాడు. కాని ఇదంతా కలఅనే భావం వాణ్ని వెన్నాడుతూనే ఉంది.

ఉదయకుమార్ తండ్రితోబాటు భోజనం చేసి స్కూలుకు వెళ్ళాడు. సరోజినిమాత్రం ఒక్కతే ఆఖరుకు భోంచేసింది. ఆమె రంగడిచేతనే వడ్డించుకున్నది. వాడికి వడ్డన చాతకాలేదు. కాని వాడికి అన్నీ నేర్పటం సరోజినికి సరదాగా ఉన్నది.

సరోజిని స్కూలుపైనలు పాసయి ఇక చదవక్కర్లేదని చెప్పేసింది. ఇంగ్లీషు నవలలూ, తెలుగు పత్రికలూ చదవ డమూ, రేడియో వినటమూ, సినిమాలు చూడటమూ, కుక్కను ఆడించటమూ తప్ప ఆమెకు చెప్పుకోతగ్గ పనిఏమీ లేదు. ఇప్పుడు రంగడు దొరికాడు. వాడికి గార్డియన్‌గా ఉండి వాడికన్నీ నేర్పటం సరోజినికి మంచి వ్యాపకంగా కనబడింది.

అందరూ అన్నాలు తిన్నాక రామమ్మ రంగణ్ణి అన్నా నికి రమ్మన్నది. రంగడికి ప్రాణం పిచపిచలాడుతున్నది.

"నా కిప్పుడాకలిగా లేదండీ. తరవాత తింటాలెండి!" అన్నాడు రంగడు.

రామమ్మ వాణ్ని వొత్తిడి చెయ్యలేదు. తనకు ఆకలి లేదనీ, అన్నంతినే అలవాటులేదనీ ఇతరులకు తెలియటంలో గల అపాయం రంగడికి తెలుసు. ఈ విషయం రహస్యంగా ఉంచటం ఎట్లాగా అని వాడు ఆలోచిస్తూనే ఉన్నాడు.

వంటావిడ అన్నం తిని, "రంగడూ! నేను కాస్సేపు నడుం వాలుస్తాను గాని నువు పెట్టుకుతిన్న తరవాత గిన్నె లన్నీ పక్కగదిలో కుళాయిదగ్గిర పెట్టేసి వంటిల్లు బాగుచేసి పో!" అన్నది.

"సరేనమ్మా!" అన్నాడు రంగడు ఆపూటకు గండం తప్పింది.

ఆ సాయంకాలం సరోజిని రంగణ్ణి సినిమాకు వెంట పెట్టుకెళ్లింది. వా డెన్నడూ సినిమా చూడలేదని తెలిసి సరోజిని పొందిన ఆనందం ఇంతా అంతా కాదు. సినిమా చూసినంతసేపూ ఆఅమ్మాయికీ, తానే మొదటిసారి సినిమా చూస్తున్నట్టుగా ఉండి, రంగడు పొందుతున్న ఆనందమంతా తానూ పొందుతున్నట్టనిపించింది.

అంతా అయాక రంగడు, "అంతా మాయ!" అన్నాడు.

"ఏమిటనుకున్నావు మరి?" అన్నది సరోజిని.

కథా నిలయం
శ్రీకాకుళం

## 4

రంగడు అన్నం తినటం లేదని రామమ్మకు రెండో రోజు అనుమానం కలిగింది. మూడోరోజు ఈవిషయం ఆవిడ రూఢి చేసుకున్నది. ఆమె నిలదీసి అడిగేసరికి రంగడు తప్పు చేసినవాడల్లే ఒప్పుకున్నాడు.

"మీకు పుణ్యం ఉంటుంది. ఈమాట ఎవరితోనూ చెప్పకండి. నన్ను నిష్కారణంగా చంపేస్తారు. నాకు ఆకలెయ్యదు. నేనెన్నడూ అన్నం తినలేదు" అన్నాడు రంగడు.

"ఓరి నీ దుంపతెగ! అదేమన్న జబ్బేమోరా? అయ్యగారితో చెబితే మందేయిస్తారు!" అన్నది రామమ్మ.

అయ్యగారితో చెప్పటమనేసరికి రంగడు కంపించాడు. తన కా యింటితో రుణం చెల్లిందనిపించింది. సరోజినీ, కుక్కపిల్లా తన కప్పుడే దూరమైనట్టే అనిపించి వాడికి ఏడుపొచ్చింది.

వాడిస్థితి గమనించి వంటావిడ వాడి రహస్యం దాచిపెడతానని మాట ఇచ్చింది. రంగడి ప్రాణం కుదటపడింది. వాడికి రోజులు హాయిగా గడిచిపోసాగాయి.

నెలాఖరుకు గోపాలరావు రంగడి చేతిలో రెండు రూపాయలు పెట్టబోయారు.

"మీ దగ్గరే ఉంచండి. నే నెక్కడ దాచను?" అన్నాడు రంగడు. వాడికిగల అవసరాలు గడిచిపోతూనే ఉన్నై.

ఒకనాటి మధ్యాన్నం ఉదయకుమార్ బజారునుంచి కొంత మిఠాయి తెచ్చాడు. ఆరోజు ఆదివారం. అతను ఆరోజు కొందరు స్నేహితులను కాఫీకి పిలిచాడు. వాళ్ళకోసం మంచి మిఠాయి తెచ్చి మేడమీద హాలులో బల్లమీద పెట్టాడు. మరి కాస్సేపటికి అతిథులు వచ్చారు. వెనక వరండాలో బల్లలు వేయించి, రంగణ్ని పిలిచి, "ఒరే, మేడమీద హాలులో బల్లమీద మిఠాయి పొట్లం పెట్టాను తీసుకొచ్చి బల్లమీద పెట్టు. తరవాత రామమ్మ ఉప్మా ప్లేటిస్తుంది. అవి పట్టుకురా। లోటాలతో మంచినీళ్ళు పెట్టు. అన్నట్టు సరోజి నిని డ్రెస్సు చేసుకోవటం పూర్తిచేసి వేగిరం రమ్మను. పో!" అన్నాడు ఉదయకుమార్.

మిగిలినవన్నీ ఎట్లాఉన్నా అడుగులోనే హంసపాద యింది. తెచ్చిన మిఠాయి అయిదు ప్లేట్లకే సరిపోయింది.

"నాకుతీపి సరుకంటే పరమ అసహ్యం!" అని ముఖం చిట్లిస్తూ సరోజిని ప్రకటించి గండం గడపజేసింది. అప్పటికి ఉదయకుమార్ స్నేహితులు ఆమెచేత తమ మిఠాయిలో సగం సగం తినిపించారు. సరోజిని "బలవంతాన" ఆ ముక్కలు దిగమింగింది,

కాని ఈ ఘటన ఇంతటితో పోలేదు. తన స్నేహి తులు వెళ్ళిపోయాక ఉదయకుమార్ పంచాయతీ చేశాడు.

అతనికి అసలే రంగడిమీద ఏదో గుర్రుగా ఉంది. తాను ఎంచి అరుగురికి తెచ్చిన మిఠాయి ఒకరికి ఎందుకు తక్కువ కావలసి వచ్చింది ? రంగడు దొంగతనం చెయ్యకపోతే మరెవరు చేసిఉంటారు ?

ఈ ప్రశ్నలకు సమాధానం లేకపోయినా సరోజిని వాణ్ని వెనకవేసుకునివచ్చి మాట్లాడింది. రంగడు ఈ రెండు నెలలపై చిల్లరకాలంలో కావలిస్తే ఎంతో డబ్బు దొంగతనం చెయ్యగలిగి ఉండికూడా కానీ ముట్టలేదు. వాడి దగ్గిర దొంగ బుద్ది ఏకోశానా లేదు ఏదో పొరపాటు జరిగి ఉంటుంది.

ఈ వాదన ఉదయకుమార్‌కు మరింత కోపం తెప్పించింది.

"రంగడి తరఫున నువ్వెందుకు మాట్లాడతావు ? వాడు దొంగతనంగా మిఠాయి తిన్నదిలేనిదీ తేల్చడం నీ డ్యూటీ గాని, వాణ్ని సమర్థించితే రేపు మరో దొంగతనం చెయ్యటానికి వాణ్ని ప్రోత్సహించట మవుతుంది. అసలీ ఇంట్లో వాడికి అలుసిచ్చిందే నువు ! వాణ్ని తెచ్చిపెట్టిందే నువు ! వాణ్ని వెంటనే పంపించి వెయ్యాలిసిందే, నాన్నతో మాట్లాడతాను." అన్నాడు ఉదయకుమార్.

సరోజినితమ్ముణ్ని బతిమాలింది.

"మిఠాయి తిన్నానని వాణ్ని ఒప్పుకోమను." అన్నాడు తమ్ముడు.

సరోజిని చాటుగా రంగడితో, "నాతో నిజం చెప్పు. మిఠాయి తిన్నావా ఏమిటి ? తింటే నిజం చెప్పెయ్యి, నిన్నెవ్వరూ ఏమీ అనలేరులే," అని బుజ్జగించింది.

తాను తినలేదంటే తినలేదన్నాడు రంగడు.

పంచాయితీ ఆ రాత్రి గోపాలంగారి దాక వెళ్ళింది. సాధారణంగా ఈ ఇంట్లో ఇటువంటి పంచాయతీలు ఎప్పుడో గాని జరగవు. ఒకవేళ జరిగితే అసలు కారణంకన్న, ఇంట్లో ఉండే వ్యక్తులమధ్య ఉండే వ్యత్యాసాలు ఎక్కువ ప్రధానంగా ఉంటాయి. అందుచేత గోపాలంగారు తీర్పు చెప్పేటప్పుడు తన ఇష్టులకు అన్యాయం చేసేవాడు :- తనకు కొంచెమైనా అర్థంకాన్ని భార్యనూ, కొడుకునూ వెనకవేసుకు వచ్చేవాడు, సరోజినికీ, వంటలక్కకూ, ఇతర పనివాళ్ళకూ ప్రతికూలంగా మాట్లాడేవాడు—వాళ్ళు తనను అర్థం చేసుకోగలరని ఆయన నమ్మకం.

ఈసారి అంతావిని గోపాలంగారు. "అవును, బాబు చెప్పింది నిజం. దొంగతనం జరిగినప్పుడు ఆరా తీయటం అవసరం, రంగడు మిఠాయి తిన్నాడని అనుమానం ఉన్నప్పుడు అది తేల్చటం రంగడికే మంచిది. వాడు దొంగఅన్న అనుమానంతో వాణ్ణి ఎంతకాలం ఇంట్లో ఉంచుకోగలం!" అన్నాడాయన.

"ముఖ్య విషయం మిఠాయి ఖరీదు కాదు నాన్నా, వాడికి మిఠాయి తినాలని వుంటే నేనే రోజూ తినిపిస్తా! దొంగతనం ఎందుకు చెయ్యాలని!" అన్నాడు ఉదయకుమార్. ఆ మాట వాడు అని తీరుతాడని గోపాలంగారికి తెలుసు. ఈ సూక్ష్మాలు తనకు తెలిసినట్లు మరెవరికీ తెలీవని వాడి అనుమానం!

సరోజిని లొంగలేదు.

"రంగడు దొంగతనం చేశాడని మా కెవరికీ అను మానం లేదు—బాబుకి తప్ప. ఒకవేళ రంగడు మిఠాయి తినేవుంటే ఎట్లా రుజువుచేస్తాం? వాడి పొట్టకోసి చూస్తామా? అప్పటికీ అడిగిచూశా ససేమిరా తినలేదన్నాడు ఇంకేం చెయ్యాలి?

"చేసేదేమీ లేదు వాణ్ని పంపించెయ్యాలి!" అన్నాడు ఉదయకుమార్.

"సరే అట్లాగే పంపించేస్తాం ఈ రాత్రి ఎక్కడికి పోతాడూ? రేపు ఉదయం పంపిద్దాం." అన్నాడు గోపాలం గారు.

"అన్యాయం, నాన్నా" అన్నది సరోజిని.

"వాడు దొంగతనం చెయ్యలేదనేగా నీ ఉద్దేశం? అదే నిజమయితే వాడు దొంగతనం చేశాడనుకోవటంలోనే అన్యాయం ఉంది. పంపించటంలో లేదు. వాడు దొంగ అనుకుంటూ ఇంట్లో ఉంచుకోవటం వాడికి అన్యాయం, మనం వాణ్ని ఉంచుకోవటానికి అర్హులం కాము గనక!"

తండ్రి ఈ విధంగా వాదించినప్పుడు సరోజినికి ఆయనలో వార్థక్యలక్షణాలు కనపడేవి కాని వాటిని సాధారణంగా క్షమిస్తూ వచ్చేది. ఈసారి క్షమించలేకపోయింది.

"ఇంతకన్నా హంబక్ నే నెక్కడా చూడలేదు." అన్నది సరోజిని. ఆమె కన్నీళ్లు బలవంతాన అపుకుంటున్నదని గ్రహించి గోపాలంగారు ఆశ్చర్యపడ్డాడు. రంగణ్ని పంప

కుండా ఉండేందుకు ఏ విధానం అవలంబించాలా అని తీవ్రంగా ఆలోచిస్తున్న గోపాలంగారికి రామమ్మ అనుకోని సహాయం జేసింది. ఆమె అన్నంపట్టుకొచ్చి వడ్డిస్తూ, "మీరు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు, రంగడు ఏమీ తినడు. వాడు అన్నమే తినడు," అన్నది.

"అంటే ?" అన్నాడు గోపాలంగారు.

"వా డీ ఇంటికి వచ్చిన తర్వాత ఒక్క మెతుకుకూడా నోట్లో వేసుకోలేదు. వాడు కాళ్ళూ వేళ్ళూ పట్టుకుని బతి మాలితే ఈ విషయం రహస్యంగా ఉంచాను, వాడు మిఠాయి తింటున్నాడని అంటగట్టుతున్నారు : నే నేం చెప్పను !"

ఉదయకుమార్ తన పతనం గ్రహించి బింకంగా, "మిఠాయితినే వాడికి అన్నం దేనికి ?" అన్నాడు.

"తెలసీ తెలీకుండా మాట్లాడకు, బాబూ," అని కొప్పడింది రామమ్మ.

తనను ఓడించడానికి రామమ్మ ఇంత బ్రహ్మాస్త్రం—రంగడు అస లేమీ తినడన్నంత గొప్ప అబద్ధం—ప్రయోగి స్తుందా అని ఉదయకుమార్ కు ఏడుపొచ్చింది.

"ఈమాట నువ్వు నమ్ముతావా, నాన్నా ? అని అడి గాడు వాడు.

గోపాలంగారు వినిపించుకోలేదు. ఆయన బుర్రలో అనేక భావాలు మెఱుపుల్లాగా వచ్చి పోతున్నాయి. రామమ్మ మాట అబద్ధమని ఆయనకు ఒక క్షణంకూడా అని పించలేదు. మనుషులు తిండిలేకుండా ఉండటం సాధ్యమా ?

తిండికోసమే అందరూ అడ్డమైన పాపాలు చేస్తూ, అనేక తాప త్రయాలకు లోనవుతూ, తిండి దొరకనప్పుడు మాడి చచ్చే ఈ ప్రపంచంలో తిండి అక్కర్లేకుండా బతకటానికి ఏం మహత్తు తోడ్పడాలి? రంగడు ఈ రెండున్నర మాసాలనుంచీ తిండి తినటం లేదనుకున్నా, గొప్ప విషయమే కదా! ఇంత దీర్ఘ కాలం ఉపవాసం ఉండి మామూలుగా తిరిగినవా ళ్ళెవరైనా ఉన్నారా?... తిండి తింటేకాని బతకలే మన్నది చిట్టచివరకు మూఢవిశ్వాసంగా తేలదుగదా... ఇన్నాళ్ళూ రంగడు తన ఇంట తిండికీగాక, జీతానికీగాక ఎందుకు పనిచేసినట్టు? అటు వంటి వాడికి మిఠాయి దొంగతనము అంటగట్టటమా? ఇంత సంస్కారంగల నవ కుటుంబం సంస్కారంలేని రంగడికి చేసేది ఇదా?... రంగడికి సరోజినిఅన్నా, కుక్క అన్నా, రామమ్మ అన్నా, తను అన్నా ఎంతో ప్రేమ. మనుషులను కట్టేసేది ప్రేమేగాని స్వార్థంకాద నటానికి ఇంతకంటె మంచినిదర్శనం ఏంకావాలీ?...

అకస్మాత్తుగా గోపాలంగారి బుద్ధి ఈ ఆలోచనలకు పెడదిరిగింది. ముందు రంగడి సంగతి శాస్త్రీయంగా రుజువు కావాలి. వాణ్ణి డాక్టర్ల చేత పరీక్ష చేయించాలి. ఇందువల్ల శాస్త్రాని కెంతో ఉపయోగం ఉండడమేగాక తాను తన జీవితం యావత్తూ కొత్త తత్వం అన్వేషించటానికి ధార పోయవచ్చు.

గోపాలంగారిలో సత్యాన్వేషణాశక్తి మళ్ళీ ప్రజ్వలించింది. ఆయనలో కొత్తచైతన్యం ప్రవేశించింది.

# 5

రంగడు విచారంగా ఉండటం చూసి సరోజిని వాణ్ణి బుజ్జగిస్తూ, "రంగా నీకేమిటి భయం? నువు తిండి తినవని నాతో ఎందుకు చెప్పలేదూ? నా యీడువాడు తిండితినకుండా బతుకుతున్నాడంటే ఎంత గొప్ప! నీ పేరు, ఫోటో పత్రికల్లో వేయిద్దాం. గొప్పగొప్ప డాక్టర్లు వచ్చి నిన్ను పరీక్ష చేస్తారు నీ వంటివాడు మరొకడు ప్రపంచలో లేకపోవచ్చు తెలిసిందా?"! అన్నది.

"వాళ్ళంతా నన్ను కాకులు పొడిచినట్లు పొడుస్తారు." అన్నాడు రంగడు బిక్క మొహంతో.

మెల్లిగా సరోజిని వాడికి ధైర్యం చెప్పింది. "నిన్ను ఎవరూ ఏమీ చెయ్యరు. నువ్వంటే అందరికీ గొప్పగా ఉంటుంది. డాక్టర్లు నిన్ను పరీక్ష చేసిన తరవాత నీ పేరు పుస్తకాల్లో కూడా రాస్తారు. అవసరమైతే నిన్ను యూరపు కూడా తీసుకుపోతారు. ఎవరు చూశారు. నీ మూలంగా ఆకలి చావులు నివారణ కావచ్చు. మనుషుల్ని అనాదిగా పట్టి పీడించే ఒక బాధ శాశ్వతంగా పోవటానికి నువు సహాయ పడవచ్చు."

సరోజిని మాటలు రంగడి కేమీ అర్థకాలేదు గాని ఆమె గొంతు వాడికి ఉత్సాహ మిచ్చింది. డాక్టర్లు పరీక్షించ

టానికి వాడు ఒప్పుకున్నాడు. అంతేగాక అర్ధరాత్రివేళ పారి పోదామని చేసుకున్న నిర్ణయాన్నికూడా వాడు మార్చు కున్నాడు.

మార్చుకున్నందుకు వాడికి పశ్చాత్తాపం కలగలేదు. వాడొక పెద్ద ఆకర్షణ అయ్యాడు. అందరూ వాణ్ణి గురించి చెప్పుకునేవారే! అందరూ వాణ్ణి వింతగా చూసి, ప్రశ్నలు వేసేవారే, ఎవరెవరో పెద్దమనుషులు—గోపాలంగారింటికి ఎన్నడూ రానివారు కూడా—రావడం, రంగణ్ణి పిలిపించి వాడికేసి ఎగాదిగా చూడటం. "వీడేనా" అని గోపాలంగార్ని అడగటం, కొంచెం అనుమానంగా, కొంచెం ఆశ్చర్యంగా తల పైకి కిందికీ ఆడించటం! రోజూ మేడమీద సాయంత్రం పూట చర్చలు.

"...చెప్పలేం, చూడండి! కప్పలు ఎండి ఒరుగై ఎన్నో ఏళ్లు వుండి కూడా తిరిగి నీరు తగలగానే బతికి చెంగున గంతేస్తాయిట."

"అది పోనివ్వండి కప్ప శీతలరక్త జంతువు. ఆహారం లేనప్పుడు అది చచ్చినట్లుంటుంది. పాముల్ని తీసుకోండి. అవి ఉష్ణరక్త జంతువులై ఉండి కూడా అతి దీర్ఘకాలాలు అహా రం తినకుండానే ఉంటాయట. అంతకన్న ముఖ్యమైనదే మంటే వూ కూలుగా తిరుగుతాయట!..."

"నా బుద్ధికేంతోస్తుందీ అంటే, హోమియోపతీలో చూశారూ, ఉపవాసంవల్ల ఉపశమనంగల ఔషధాలు కొన్ని ఉన్నాయి. అటువంటి శరీరతత్వాలు గలవారు తిండిలేకుండా ఎంతకాలమైనా ఉంటారు."

"పోనిస్తురూ, మనంచూస్తే నాగరికతలో పడి ప్రతిదీ విడ్డూరంగా చూస్తున్నాం. మా అత్తవారి ఊళ్ళో ఒకావిడ వుంది. అన్నం తిని పన్నెండేళ్ళయిందిట. ఎవరూ చెప్పుకునే వారే లేరు. మన మిడిమిడి జ్ఞానానికన్నీ వింతలే!"

"ఓహో, చెప్పరేం! ఇంకా ఇటువంటి వాళ్ళున్నా రన్నమాట! అయితే ఆవిణ్ణి గురించి కూడా పత్రికల్లో రాయించి, ఫొటో వేయించాలిసిందే! లోకోత్తరమైన విష యాలు కావుటండీ!"

ఈ విధంగా ఎవరికి తోచింది వారు, తెలిసో తెలియకో నిజమో అబద్ధమో మాటాడేసేవారు. రంగడి దగ్గరికి పత్రికా విలేఖరులు వచ్చారు. ప్రశ్న లడిగారు. రాసుకు వెళ్ళారు.

ఊళ్ళో ఉన్న డాక్టరు సుందరంగారు రంగణి తన యింట్లో వారంరోజు లుంచుకున్నాడు సరోజిని గూడా తన వెంట ఉండే షరతుమీద రంగడు దీనికి సమ్మతించాడు. ఈ వారం రోజుల్లో రంగడు ఎప్పుడైనా కాసిని మంచినీళ్ళుతప్ప ఇంకేమీ ముట్టలేదు. వాడిముఖంలో ఏమీ మార్పులేదు. డాక్టరుగారు ఆఖరురోజున వాడిచేత తవ్వటం పని రెండు మూడు గంటలు చేయించాడు. ఆ రోజు మంచినీళ్ళు ఎక్కువ తాగాడు రంగడు.

"నీ కెప్పుడైనా జబ్బుచేసిందిరా!" అని అడిగాడు డాక్టరు. రంగడు చెప్పలేకపోయినాడు. వాడిశరీరంమీద కురు పుల మచ్చలూ అవీ కనిపించలేదు. జలుబుచేసి తుమ్ములు వస్తాయా అంటే ఎప్పుడన్నా తుమ్ముతానని రంగడు ఒప్పు కున్నాడు.

మొత్తంమీద రంగడి ఆరోగ్యం మామూలు మనుషుల కంటె మంచిదనీ, వాడికి కనబడే దానికంటే కొంచెం ఎక్కువ వయసే ఉండవచ్చుననీ, వాణ్ణి పట్టణం తీసుకుపోయి జనరల్ ఆస్పత్రిలో పరీక్షిస్తే అమూల్యమైన విషయాలు తెలుస్తాయనీ డాక్టరుగారన్నారు. తాను చేసిన కొద్దిపాటి పరీక్షలో తేలిన విషయాలు రిపోర్టురాసి, పట్నంలో తాకెరిగిన పెద్ద డాక్టరుకు ఉత్తరంకూడా రాసి దాని నకలును, రిపోర్టుతో సహా గోపాలంగారికి కిచ్చాడాయన.

"ఇది బహుశా పట్నంలో కూడా తేలదు. ఏ అమెరికాకన్నా పంపవలసి రావచ్చు. ఇటువంటి కేసులు కొన్ని పరీక్షకు వచ్చాయిగాని అందులో చాలాభాగం మోసం. మిగిలినవి కూడా అంత సంతృప్తికరమైనవి కావు. నా ఉద్దేశంలో రంగడు నిర్దుష్టమైన కేసుగా కనిపిస్తుంది. వాడు తన రహస్యాన్ని దాచిపెట్టటమే దాఖలా," అన్నాడు డాక్టరు.

కొద్దిరోజుల్లోనే గోపాలంగారు రంగడితో పట్నానికి ప్రయాణం కట్టారు. సరోజిని కూడా వస్తేగాని వీల్లేదన్నాడు రంగడు. ముగ్గురూ కలిసే వెళ్ళారు. మంచి హోటల్లో మకాం పెట్టారు.

డాక్టరు వైకుంఠంగారు డాక్టరు సుందరంగారి రిపోర్టు చదివారు. ఆయన గోపాలంగారితో శరీర ధర్మం గురించి అనేక వింత విషయాలు-శాస్త్రానికి అందనివి—చెప్పారు.

"ఒక్కొక్క మనస్థితిలో శరీరం విచిత్రమైన శక్తులు ప్రదర్శిస్తుంది. నా చిన్నతనంలో దయ్యంపట్టిన ఆడమనిషిని చూశాను. మూడు నెలలపాటు ఆవిడ పచ్చి మంచినీళ్ళుకూడా

తాగలేదు కాని ఆస్థితిలో ఆమె కోతులకన్న వేగంగా చెట్లెక్కేది. పది హేనుమంది మనుషులు కదిలించలేని రోలు ఎత్తి అంత దూరం పారేసింది... హిప్నాటిజం తీసుకోండి. హిప్నాటైజ్ చేసిన మనిషి శరీరం శరీరధర్మాలను పాటించదు. కాలిస్తే బొబ్బకూడా ఎక్కదు. ఆ శరీరం పాటించే వాస్తవం ఆ మనిషి బుద్ధిలోనే ఉంటుంది. హిప్నాటైజ్ అయిన మనిషి తాను మంచుకొండలమీద ఉన్నాననుకుని నడి వేసవిలో వొణికిపోగలడు:..." ఈవిధంగా ఆయన మాట్లాడుకుంటూ వెళ్ళాడు.

మిస్టిసిజం అందరికి రుచిస్తుంది. పరిశోధనలద్వారా రుజువైన శాస్త్ర విషయాలనే మిస్టరీలాగా చెబితే జనం మరింత ఆసక్తిగా వింటారు. శాస్త్రపరిజ్ఞానం సాధించిన గొప్ప విషయాల కంటె, శాస్త్రానికి అతీతంగా వున్నట్టు చెప్పబడే విషయాలు జనాన్ని ఎక్కువగా ఆకర్షిస్తాయి. వైకుంఠంగారు చెప్పే విషయాలను గోపాలంగారు ఎంతో ఆసక్తితో వింటూ తానేవో కొత్త సత్యాలను తెలుసుకుంటున్నా ననుకున్నాడు.

త్వరలోనే రంగడి పరీక్షకు కార్యక్రమం తయారయింది...బ్లడ్ టెస్ట్, స్టమక్ పంపు, ఎలెక్ట్రోకార్డియోగ్రాఫ్, ఎక్స్‌రే, వగైరా వగైరా...

ఈ పరీక్ష ప్రారంభమయేలోగా ప్రెస్‌వాళ్ళ ఇంటర్‌వ్యూలు: అదివరకు ప్రశ్నించినవాళ్ళకీ, ఈపట్నంలో తనను ప్రశ్నించేవాళ్ళకి తేడా తెలుసుకున్నాడు రంగడు. తాను దొంగ అన్నట్టూ, అబద్ధాలాడుతున్నట్టూ చూశారు. వీళ్ళు రకరకాల ప్రశ్నలు వేసి తాను రహస్యంగా ఏవేవో తింటు

న్నట్లు ఒప్పించాలని ప్రయత్నించారు. వాళ్ళతో వాడికి మాట్లాడ బుద్ధి పుట్టలేదు

కాని వాడిఅసలు బాధలు ఆస్పత్రిలో చేరాక ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి వాతావరణానికే వాడు బెదిరాడు. ఆస్పత్రిలో వాడివెంట సరోజనివుండటానికి అనుమతిరాలేదు. ఒక్కరోజు గడిచే లోపుగానే వాడికి మతిపోయింది. తాగనంటున్నకొద్దీ ఆస్పత్రివాళ్ళు వాడిచేత నాలుగు ఔన్సులు పాలు తాగించారు. వెంటనే దాన్ని వాడు వాంతి చేసుకున్నాడు. ఆ రాత్రికల్లా రంగడు నీరసపడ్డాడు. మర్నాడు వాడి తూకం తగ్గి వున్నది డాక్టర్లు తమలో తాముకూడబలుక్కున్నారు తెలుగురాని ఒక డాక్టరు వాడి దగ్గరికివచ్చి అరిచాడు—పాలు తాగనన్నప్పుడుకూడా ఇట్లాగే అరిచాడు. పక్కనున్న యువకుడు ఈ అరుపులను తర్జుమా చేశాడు.

"నిజంచెప్పు! నువు రోజూ తిండి తింటావా లేదా?"

"తింటానండి!" అన్నాడు రంగడు వాడిచేత ఆమాట అనిపించాలనే దేమిటో వూహించటం కష్టం.

అందరూ తెల్లబోయారు. మరుక్షణంలోనే అగ్నిపర్వతం పగిలింది రంగడిమీద. ప్రశ్నలవర్షం రాళ్లవర్షంగా కురిసింది. వాడు అన్నంతినటం లేదన్నది అబద్ధమేనా? ఇంత బొట్టికాయ వెధవ ఇంతమందిని ఇంతకాలం మోసంచేశాడా? ఎట్లా చేశాడు? డాక్టరు సుందరంగారు పరీక్షించి నప్పుడు వాడికి రహస్యంగా ఆహార మిచ్చిన దెవరు? ఇం కెవరో సహాయం చెయ్యకపోతే ఇంతమోసం వాడి ఒక్కడివల్లా కాదు!

రంగడు శోకాలు పెట్టాడు.

"నన్ను పోనివ్వండి ఇంటికి పంపెయ్యండి నేను రోజూ అన్నం తింటాను, రోజూ తింటాను !" అన్నాడు వాడు...

రంగడు తిరిగి వచ్చెయ్యటం చూసి గోపాలంగారు నిర్ఘాంతపోయారు. జరిగిందంతా విని ఆయనకు పట్టరాని ఆగ్రహం వచ్చింది.

"వెధవా ! నాకెంత అప్రతిష్ట తెచ్చావ్ ! వాళ్లతో అబద్ధ మెందుకు చెప్పావ్ ?... లేక మాతోనే అబద్ధం చెప్పావా ?...ఈ అవమానం ఎట్లా భరించటం ఎందుకు చేశా విపని: నేనూ,ఆ ఆస్పత్రితో డాక్టర్లూ గొప్ప సత్యాన్ని కనుక్కోవటానికి ప్రయత్నిస్తున్నామనే జ్ఞానం నీకు లేదా ? ఈ విషయంలో నీకు బాధ్యత వుందని తెలియదా ?" అని గోపాలంగారు చిందులు తొక్కారు. రంగడు నోరు మూసు కుని మాట్లాడలేదు.

ఇది ఇంతటితో పోలేదు. ఆసక్తిగల రిపోర్టరొకడు ఆస్పత్రికి టెలిఫోన్ చేసి, రంగడు వెళ్ళిపోయాడనీ, వాడు అన్నం తింటున్నానని ఒప్పుకున్నాడనీ తెలుసుకున్నాడు. ఆ సాయంత్రం పత్రికల్లోనే "గొప్ప మోసము" అనే శీర్షికతో రంగణ్ని గురించి అయిదారు పంక్తులు పడింది.

"ఈ ఘోరం నేను యావజ్జీవం భరించలేను. రేపు మళ్ళీ నిన్ను ఆస్పత్రికి పంపిస్తాను. ఇది నీ సమస్య కాదు. నాది !" అన్నాడు గోపాలంగారు.

ఆరాత్రి సరోజినికి సరిగా నిద్రపట్టలేదు. రంగడు చేసిన పనిగురించి ఆమె ఇంతవరకు ఏనిర్ణయానికీ రాలేదు.

ఒకరాత్రివేళ మగతనిద్రలో ఆమెకు ఆ హోటల్ గది మూల నుండి సన్నని ఏడుపు వినిపించి తుళ్ళిపడి లేచింది. రంగడు తన పక్క మీద చుట్టచుట్టి పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. సరోజినికి వాణ్ణిచూస్తే ఎక్కడలేని జాలీ తన్నుకొచ్చింది ఆమె లేచివెళ్ళి వాడిపక్కనే పడుకుని వాణ్ణి దగ్గరకు లాక్కుని కళ్ళుతుడిచింది. క్రమంగా వాడి ఎక్కులు తగ్గిపోయాయి. కొద్దిసేపట్లో వాడు నిద్రపోయినాడు. సరోజిని కూడా నిద్రపోయింది.

గోపాలంగారు నిద్రలేచేసరికి ఆరున్నర కావస్తున్నది. ఆయన సరోజినిని లేపి, "రంగడెక్కడమ్మా" అని అడిగాడు.

సరోజిని నిద్రమత్తుగా, "ఎక్కడో ఉంటాడు, నాన్నా!" అన్నది కాని రంగడు తప్పించు పోయినాడు ఇంకా అయిదు గంటలు కాకముందే వాడు మేడ దిగి ఎటో వెళ్ళిపోయినట్లు తెలిసింది.

పోలీసులకు రిపోర్టిచ్చి వాణ్ణి వెతికించాలని గోపాలంగారికి క్షణంపాటు ఆలోచన వచ్చిందిగాని, ఆ ఆలోచనను ఆచరణలో పెట్టేశక్తి ఆయనకు లేకపోయింది. ఆ ఉదయం ఎక్స్‌ప్రెస్ కే తండ్రి కూతుళ్లు స్వగ్రామానికి తిరిగి వచ్చేశారు.

రంగడిమీద కోపమంతా పోయినాక గోపాలంగారికి మిగిలిన చింత ఏమంటే, రంగడు మూడు నెలలపాటూ తమకు చాకిరీచేసి దమ్మిడీజీతంగాని, పిడికెడు అన్నంగాని తీసుకోకుండా వెళ్ళిపోయాడని!